# శాంతి

# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

ఏప్రిల్/April - 2022

ॐ

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయోభవేత్

ఏకం సత్ విప్రా బహుధా వదంతి

ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

– ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI


**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

సంపుటి / **Vol. 98** ఏప్రిల్/**April - 2022** సంచిక/**No.4**


| వ.నెం. | విషయ సూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన – ఆనంద రామాయణం | 2 |
| 2. | ధ్యానము – ఆత్మ విద్యావిలాసము | 2 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ–అనువాదం:శ్రీమతి బొప్పన అరుణాదేవి | 3 |
| 4. | శ్రీరామనవమి సందేశము – పూజ్యశ్రీ జ్ఞానేశ్వరీ మాతాజి | 7 |
| 5. | భగవత్ కృప – శ్రీ అఖండానంద సరస్వతీ మహరాజ్ | 9 |
| 6. | తత్వమసి – శ్రీ తెన్నేటి విశ్వనాథం | 12 |
| 7. | శ్రీ తులసీ సర్వస్వము – జి.వి.యస్. సుబ్రహ్మణ్య శాస్త్రి | 15 |
| 8. | పిపాజి రాజు చరిత్రము – ఆది పాండురంగభక్త విజయము | 18 |
| 9. | రాకుమారుడు – ఏడు చేపల కథ | 23 |
| 10. | కార్యక్రమములు, విరాళములు | 26 |

*** ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులు కాని. సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/–లు సాలుసరి రూ.100/–**

# ప్రార్థన

## ఆనంద రామాయణం

### ప్రార్థన ద్వారా అహం నశిస్తుంది

యది తుష్టోసి దేవేశ శ్రీరామ కరుణానిధే ।
తవాద్య దర్శనేనైవ కృతార్థోహం న సంశయః॥

ధన్యోహం కృతకృత్యోహం పుణ్యోహం పురుషోత్తమ ।
అద్య మే సఫలం కర్మ హ్యద్య మే సఫలం తపః॥

అద్య మే సఫలం జ్ఞానమద్య మే సఫలం శ్రుతమ్ ।
అద్య మే సఫలం సర్వం త్వత్పదాంభోజదర్శనాత్ ॥

అద్వైతం విమలం జ్ఞానం త్వన్నామస్మరణం తథా ।
త్వత్పదాంభోరుహద్వంద్వే సద్భక్తిం దేహి రాఘవ ॥

దయానిధియగు శ్రీరామా! నీవు ప్రసన్నుడవైతే నేను నీ దర్శనము చేతనే ధన్యుడనైతిని, ఇందులో సంశయము లేదు. నేను ధన్యుడను, నేను కృతకృత్యుడను, నేను పుణ్యవంతుడను, పురుషోత్తమా! నీ పాద పద్మములను దర్శించినందువలన నా సుకృతము పండినది. నా తపస్సు నేడు ఫలించినది. నా జ్ఞానము ఈదినమున సఫలమయ్యె. నేడు నా తెలివి ఫలితమయ్యె. సర్వమును ఇప్పుడే సఫలమయ్యెను. శ్రీరామా! నీ రెండుపాదపద్మములయందు సద్భక్తిని, నీ నామస్మరణమును, నిర్మలమగు అద్వైత జ్ఞానమును నాకిమ్ము అని ప్రార్థించెను.

# ధ్యానము

## ఆత్మ విద్యా విలాసము

### తీవ్రమైన వ్యాకులతతో ధ్యానం చేసినప్పుడు జ్ఞానోదయం కలుగుతుంది

శ్లో॥ యాచిత్రప్రభా త్వమితి మేయ విభాసయిత్రీ
యత్సంక్రమా ద్ఘటపటా ద్యవభాసికా ధీః।
ఆబ్రహ్మకీట మహ మిత్యవభాసమానా
యా సైవ సంవిదితి చింతయ సంతతం త్వమ్ ॥

ఏ చిత్తుయొక్క ప్రకాశం విషయ వస్తువున్ని 'నీవు'గా వెలిగించి చూపుతుందో, దేని ప్రసరణవల్ల బుద్ధి ఘటాన్ని, పటాన్ని విచక్షింప గలుగుతుందో, దేనివల్ల బ్రహ్మనుండి పురుగువరకు 'నేను' అనే భావం వెలుగుతోందో అదే సంవిత్తు అని నీవు నిరంతరం భావన చెయ్యి.

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామీజీ ఆత్మకథ

**అధ్యాయం - 37**

మూలం : స్వామి ఓంకార్ అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి

**బుద్ధ భగవానుడు నిర్వాణ స్థితిని పొందినప్పుడు శాశ్వతమైన ఆనందాన్ని పొందెను**

## సుశీలాదేవి భారతదేశం చేరుకుంది

ఆ రోజు మేము చాలా సంతోషించాము. సుశీలాదేవి వద్ద నుండి టెలిగ్రామ్ అందింది. ఆమె జపానులో బయలుదేరి సిలోన్ చేరుకుంటారు. అమెరికా భక్తులు ఇచ్చిన విల్లిస్ కారు శాంతి ఆశ్రమంలో ఉంది. దానిని నేను రెండవ పర్యాయము అమెరికా వెళ్ళినప్పుడు తీసుకువచ్చాను. దానిని ఇప్పుడు సుశీలాదేవిని తీసుకురావడానికి వినియోగించాలను కున్నాను. ఆత్మారామ్, రత్నం, మరొక ఆశ్రమ భక్తులు నాతో పాటు కారులో బయలుదేరారు. మా కారు డ్రైవర్ బలరామ్ చాలా నమ్మకస్తుడు, భక్తుడు. భారతదేశం నుండి సిలోన్ సముద్రం మధ్యలో ఉండటం వలన సిలోన్ వరకు కారులో వెళ్ళటం కుదరదు. అందువలన ఆశ్రమ కారును మేము మద్రాసులోని భక్తుల ఇంటిలో వదిలిపెట్టాము.

మద్రాసు నుండి మేము రైలులో బయలుదేరి సాధ్యమయినంత వరకూ వెళ్ళి అక్కడి నుండి స్టీమరులో ప్రయాణించి కొలంబో చేరుకున్నాము. సుశీలాదేవి మా అందరిని చూచి చాలా సంతోషించింది. మూడు రోజులు కొలంబోలోనే ఉండి సుశీలాదేవికి అందమయిన పగోడాలు, ఉద్యానవనాలు, ఆహ్లాదాన్ని కలిగించే బీచ్‌లు అన్నీ చూపించాము. మేము మద్రాసు చేరుకునేసరికి మా శాంతి ఆశ్రమం కారుని వదలిపెట్టిన ఇంటి వాళ్ళు, అక్కడి భక్తులు మా కోసం ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. వారందరి ప్రేమ, ఆదరాభిమానాలతో మద్రాసులో వారం రోజులున్నాము. సుశీలాదేవిని మద్రసు చుట్టుప్రక్కల ప్రదేశాలన్నీ తిప్పి చూపించాము. మధుర మీనాక్షి దేవాలయాన్ని దర్శించాము. పరమ పవిత్రమయిన ఆ దేవాలయము అద్భుతమయిన శిల్ప సౌందర్యంతో, వందలాది శిలాతోరణాలతో, రాతి స్తంభాలతో, మహాద్భుతంగా ఉంటుంది. ఆ పవిత్రమయిన దేవాలయాన్ని మానవమాత్రులు నిర్మించలేదని, స్వయంగా దేవతలు నిర్మించారని చెపుతుంటారు. అందులో వాస్తవం ఏమయినప్పటికి సుశీలాదేవి ఆ ఆలయ సౌందర్యాన్ని తిలకించి ముగ్ధురాలయిపోయింది. ఆమె ఆ ప్రయాణాన్ని ఎంతో ఆనందంగా గడిపింది.

సుశీలాదేవికి ఆహారము, భాష, వేషధారణ అంతా క్రొత్త అయినా ఈ వాతావరణానికి అలవాటు పడడానికి ప్రయత్నించింది. ఆమె చాలా తేలికపాటి ఆహారం తీసుకునేది.

పచ్చి కూరగాయలు, సలాడ్లు, పళ్ళు, పాలు అలవాటు చేసుకుంది. భారతీయ మహిళలు ధరించే చీర కట్టుకోవడం నేర్చుకుంది. ఆమె పూర్తిగా భారతీయురాలిలాగా అచ్చమైన హిందువులా కనిపించడానికి, కేవలం ఆలోచనలకి పరిమితం కాకుండా వ్యవహారంలో కూడా అలాగే ఉండడానికి ప్రయత్నించేది. నా మాటల్లో కంటే ఆశ్రమవాసులు ఆమెకిచ్చిన స్వాగత పత్రము, ఆమె దానికిచ్చిన సమాధానము చదివినప్పుడు పాఠకులకు పూర్తిగా అర్ధమవుతుంది.

పీస్ పత్రిక జులై 1931

## స్వాగత పత్రము

గౌరవనీయురాలైన సోదరి ఎలెన్ సెయింట్ క్లేయర్ నోవాల్డు, సోదరి సుశీలాదేవి, మీరు మాకు ఎంతో ప్రియమైన సోదరి! శ్రీశాంతి ఆశ్రమము సోదర సోదరీమణులందరూ మీకు హృదయపూర్వకంగా స్వాగతం పలుకుతున్నాము. మీరు ఎంతో దూరదేశమయిన అమెరికా నుండి మా శాంతి ఆశ్రమానికి వచ్చారు.

మీరు మా పూజ్య స్వామీజీ ఓంకార్ గారితో వస్తున్నారని విని మేము ఎంతగా ఆనందించామో మాటల్లో వర్ణించలేము. మీరు ఎంతో ఆసక్తితో, అంకితభావంతో శాంతి మిషన్ చేస్తున్న శాంతి కార్యక్రమాల్లో మాతో కలిసి పాలు పంచుకునేందుకు భగవంతుని ఆదేశము మేరకు రావటం చాలా సంతోషదాయకం. సోదరీ సుశీలాదేవి! మేము మీలో ఎంతో ఉన్నతమయిన, ఆదర్శవంతమయిన ఆలోచనలను, సాధుశీలత్వాన్ని ప్రేమాస్పదమయిన హృదయాన్ని, ప్రపంచాన్ని యావత్తును ప్రేమించే గుణాలను గుర్తించి ఆనందిస్తున్నాము. మీ ఆదర్శాలు, ఉన్నతమయిన, పవిత్రమయిన సంకల్పాలు, ఎల్లలులేని మీ హృదయపు లోతుల్లోని ప్రేమ ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలని, ఆ స్ఫూర్తితో వారందరూ కూడా ఆధ్యాత్మికంగా ఉత్తేజితులు కావాలని ఆశిస్తున్నాము. మీ జీవితంలో ఏదయితే వ్రాసిపెట్టి ఉందో, ఎల్లప్పుడూ నీ పెదవులపై చిరునవ్వుతో, స్వర్గలోకపు శాంతిని అందించే పనిలో అందరూ మీతో కలిసి పనిచేస్తారు.

ఈ సందర్భంలో మీరు మా పూజ్య స్వామీజీకి అందించిన సహాయ సహకారాలకి మేము మా ప్రగాఢమయిన కృతజ్ఞతలను, మనస్ఫూర్తిగా ధన్యవాదాలను తెలియచేయాలను కుంటున్నాము. స్వామీజీని మీరు మొదటి సారి కలుసుకున్నప్పటినుండి మీరు వారి ప్రవచనాలు విన్నప్పటి నుంచి ఎంతో భక్తి శ్రద్ధలతో వారిని సేవించటమే కాకుండా, స్వామీజీ భాతదేశానికి తిరిగి వచ్చేంతవరకూ వారికి ప్రయాణంలో కూడా ఎంతో సహాయం చేశారు. వాటన్నింటికి మా ఆశ్రమం తరఫున ధన్యవాదాలు తెలియచేస్తున్నాము.

ఆ పరమాత్మ మీ మీద తమ అనుగ్రహవర్షాన్ని కురిపించాలని, దానివలన మీరు అనంతమయిన శక్తి సామర్థ్యాలు పొందాలని, మంచి ఆరోగ్యంతో వర్థిల్లాలని, దీర్ఘాయుష్షుతో ఉండాలని, అప్పుడు మీ పవిత్రమయిన ఆశయాలు, సంకల్పాలు నెరవేరాలని, అందరికి శాంతి ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము.

## సుశీలాదేవి సమాధానము

ప్రియమైన భారతీయ సోదర సోదరీమణులారా! నేను నిజముగా ఆ భగవంతుని గొప్పతనము వలన, మీ అందరూ నా పట్ల చూపించిన ఆదరాభిమానాలకు నా హృదయం ఆనందంతో నిండిపోవడం వలన మాటలు రావడం లేదు. మీ అద్భుతమయిన స్వాగత సత్కారాలకు హృదయం పొంగిపోతున్నది. ఇలాంటి సందర్భాలలో మాటల్లో మన సున్నితమయిన భావాలను వెల్లడించటం చాలా కష్టము. నేను సిలోన్‌లో దిగినప్పటి నుండి మీరందరూ  నా పట్ల చూపిస్తున్న ప్రేమకు చాలా సంతోషము. కోలంబోలోనూ, మద్రాసులోనూ నన్ను కలుసుకోవడానికి పూజ్య స్వామీజీ, ఆత్మారామ్  మూర్తీభవించిన స్త్రీత్వంతో ఉన్న రత్నం గారు మల్లెపూలు, చామంతుల దండలతో వచ్చి స్వాగతం చెప్పటం నాకు చాలా ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించింది. ఆనందరావు, కమలాదేవి, వారి ముగ్గురు ముద్దుబిడ్డలు ఎంతో ప్రేమానురాగాలతో, అపురూపమయిన, అరుదయిన భారతీయ సంప్రదాయాలతో ఆతిథ్యమిచ్చారు. ఇంకా శాంతి ఆశ్రమంనుండి మద్రాసు వచ్చిన భక్తులందరూ మా ప్రయాణాన్ని ఎంతో ఉల్లాసభరితంగా ఆనందంగా గడిపే విధంగా తోడ్పడి నందులకు నా హృదయపూర్వక కృతజ్ఞతులు.

రాజమండ్రిలో శ్రీరామారావు. రత్నం దంపతులు వారింట్లో ఎంతో చక్కని ఆతిథ్యమిచ్చారు. చాలా సంతోషంగా రోజులు గడిచాయి. పగలు రాత్రి తేడా లేకుండా భక్తులు తండోపతండాలుగా, ప్రవాహంలా వచ్చి పూజ్య స్వామీజీకి పాదపూజలు చేయటం చూచి చాలా ఆనందించాను. అది మర్చిపోలేని మధురానుభవము. ఇక శ్రీ శాంతి ఆశ్రమంలో శాంతి సభ్యులందరూ ఎంతో ప్రేమతో స్వామీజీతో కలిసి అమెరికానుండి వచ్చిన నాకు స్వాగతం పలికారు. ప్రియతములారా! ఒక్క విషయాన్ని చెప్పనివ్వండి, నా కృతజ్ఞతలు తెలియచేయడానికి నాకు మాటలు సరిపోవడం లేదు. నా అదృష్టం వలన పరమ పూజ్య స్వామీజీ వంటి పవిత్రాత్మ స్వరూపులతో కలిసి ఇంత పవిత్రమయిన ఆశ్రమానికి రాగలిగాను. ఇక్కడ అందరూ ఎంతో పవిత్రమైన హృదయం కలవారు. ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుంటున్నారు. మానవత్వంతో దైవకార్యాలు చేస్తున్నారు. మీతో కలిసి అందులో పాలుపంచుకోగల్గటం నా అదృష్టంగా భావిస్తున్నాను.

న్యూయార్క్ నగరంలో స్వామీజీని మొదటి సమావేశంలో కలిసిన క్షణంనుండి నా హృదయంలో గాఢంగా నమ్ముతున్నాను. స్వామీజీ ఆత్మ సాక్షాత్కారము పొందిన మహానుభావులు. భగవంతుని సామ్రాజ్యాన్ని చేరుకోవడానికి హృదయ పవిత్రత ఉండాలని, పరమాత్మను గురించి కళ్ళ వెంట ధారాపాతంగా కన్నీళ్ళతో భక్తుల హృదయాలలో చెరగని ముద్ర వేస్తూ స్వామీజీ ప్రవచనాలు చేస్తూ ఉండేవారు. అది విన్న తర్వాత చాలా కష్టమయిన ఆధ్యాత్మిక మార్గంలో పయనించడానికి అలాంటి మహానుభావుల మార్గదర్శనం అవసరమని, ఆ మహితాత్ముని అడుగుజాడల్లోనే పయనించాలని దృఢనిశ్చయం పొందాను. బుద్ధ భగవానుడు నిర్వాణ స్థితిని పొందినప్పుడు అనంతమయిన శాంతిని, ప్రకాశవంతమయిన జ్ఞానజ్యోతిని, శాశ్వతమయిన ఆనందాన్ని పొందారు. అలాంటి గొప్ప అనుభవాన్ని, సమాధి స్థితిని, నిర్వాణ స్థితి, స్వర్గలోకపు శాంతిని పొందిన పరమపూజ్య ఓంకార్ స్వామీజీ, దానిని ప్రపంచంలోని ప్రజలందరికి కూడా పంచిపెట్టాలని ఆశిస్తున్నారు. వారిలో నేను కూడా ఒకరిని కావటం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇంకా ఇంతకంటే ఏమి చెప్పగలను? ఈ అవకాశం దొరకటం కేవలం నా అదృష్టంగా భావిస్తూ ఎంతో సంతోషంగా ఉన్నాను. ఆధ్యాత్మికంగా ఎదగడానికి, మానవాళికి సేవలందించడానికి గొప్ప అవకాశం దొరికింది. మీ అందరికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ప్రతి ఒక్కరికి నా ప్రేమాభివందనాలు.

దీనిని నేను ప్రార్థనతో ముగించాలనుకుంటున్నాను.

## ప్రార్థన - 2

అమరమైన, శాశ్వతమైన ఆలోచనాసరళి
ఎక్కడ నుండి వస్తుందో...
ఆ జీవిత ప్రవాహం మనకి నేర్పిస్తుంది,
ఎలాంటి భయము లేని స్థితిని
మన హృదయానికి అందిస్తుంది
ఆ స్థితిలో మనము పవిత్రమయిన కన్నీటిని వర్షిస్తాము
అలాంటి స్థితిని మాకు ప్రసాదించు
ఆ వాస్తవాన్ని మా ప్రేమమయ హృదయాలలో
పదిలపర్చుకోనివ్వు
అది ఎంతో అద్భుతమయిన విషయమని
దానిని గూర్చి సాధువులు, మహాత్ములు పాడుతూ ఉంటారు.

# శ్రీరామనవమి

పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ

## రామనామమెంతో రుచిరా

భగవంతుని దశ అవతారములలో శ్రీరామావతారము చాల ముఖ్యమైనది. శ్రీదశరథ మహారాజు సంతతి లేకపోతే, పుత్రకామేష్టి యను యాగముచేసి నలుగురు పుత్రులను పొందెను. అందు జ్యేష్టుడు శ్రీరామ చంద్రమూర్తి భగవదవతారముగా జన్మించిన శ్రీరాముడు చిరుత ప్రాయము నుండియు గుణవిశిష్టుడై, వశిష్ట మహాముని యొద్ద యోగ వాశిష్టము నభ్యసించెను. విశ్వామిత్ర మహర్షికి శిష్యుడై ఆయనవద్ద అనేక అస్త్రశస్త్రముల ప్రయోగము నేర్చుకొని వారి యాగసంరక్షణ చేయగల్గెను. అచ్చట శివధనస్సు అవలీలగా విరచి జనక మహారాజ కుమార్తె యగు సీతాదేవిని వివాహమాడెను. అంతేగాకా శ్రీరామ సహెూదరులగు లక్ష్మణ, భరత, శతృఘ్నుల వివాహములు కూడ ఒక ముహూర్తముననే గొప్ప వేడుకలతో జరిగెను. వారందరును తిరిగి అయోధ్యకు వచ్చుచుండగా దారిలో పరశు రాముడు ఎదురై రాముడు శివధనస్సు విరచినందుకు చాలా ఆగ్రహించి ఆయనను సంహరించ యుద్ధమునకు తలపడెను. గాని, శ్రీరాముడు, ఆయన ఆయుధముల శక్తిని క్షణములో సునాయాసముగ తీసుకొనగల్గెను. అంతట పరశురాముడు, మహావిష్ణువే సాక్షాత్తు శ్రీరామునిగ గ్రహించినవాడై వారి యొద్ద శలవుతీసుకొని తపస్సునకు వెళ్ళిపోయెను.

శ్రీరామచంద్రుని యువరాజుగా పట్టాభిషేకము చేయ దశరథ మహారాజు ముహూర్తమునేర్పాటు చేయగా, కైకేయి కారణముగా సింహాసనాసీనుడగుటకు బదులు పదునాల్గు సంవత్సరములు అరణ్యవాసము చేయుటకు స్థితి ప్రజ్ఞుడుగా సీతాలక్ష్మణ సహితుడై, సంతోషముగ వెళ్లెను.ఆయన పితృవాక్య పరిపాలనను అమోఘముగ పాటించుటేగాక అన్నిరంగములలోను ఆదర్శముగా జీవించి లోకమునకు ఈనాటికి మార్గదర్శకుడయ్యెను. తులసీదాసు, కబీరువంటి భక్తులు శ్రీరాముని అవతార విశేషములను, రామనామ మహిమనుచక్కగా రచించిరి. రామనామం సహస్రనామతత్తుల్యం అని శివుడు పార్వతికి తారకనామ మహిమ గురించి చాలా గొప్పగా వివరించెను. ఆ పవిత్ర నామమును భక్తి విశ్వాసములతో ఒక్కసారి స్మరించిన చాలునట. “రామా! నీ నామమెంతరుచిరా” యని భక్తరామదాసు కీర్తించెను. ఈ రుచిలో సంతృప్తులైనవారు, ప్రపంచ రుచులను అవలీలగా విడనాడగలరు. ఆ రుచి సంపాదించుకొనుటకే మనకు మానవజన్మ ప్రసాదింపబడెను.

శ్రీరామకథా ప్రభావము మనదేశము నందేగాక, విదేశములలో గూడ బహుళ ప్రచారములోయున్నది. రష్యాదేశములో పిల్లల నాటకశాల యున్నదట. అచ్చట రామాయణము వరుసగా చాలారోజులు ప్రదర్శింపబడునట. టికెట్లుదొరకక నాటకశాల ఎల్లప్పుడు క్రిక్కిరిసి యుండునట. రామకథ యందు వారికిగల ఉత్సాహమునకు ఈ దిగువ విషయము గమనార్హము. శ్రీరాముడు, లేడి రూపముననున్న మారీచ సంహారార్థము వెళ్ళినప్పుడు – లక్ష్మణుడు సీతాదేవి సంరక్షణకై పర్ణశాల యొద్ద నుండెను. రాక్షస మాయచే రాముని గొంతుకతో కేకలు వినిపించగా, సీత లక్ష్మణుని వెళ్ళమని తొందర చేయగా ఆయన పర్ణశాల ముందు హద్దుగా ఒకగీత గీసి, సీతను ఆగీత దాటవద్దని చెప్పి వెళ్ళెను. సీతఒంటరిగా ఉండుటచూచి రావణుడు సన్యాసి వేషముతో "భవతి భిక్షాందేహి" యని కేకవేసి, ఆమె భిక్షనిడుటకు రాగా – రావణుడు గీతదాటిరమ్మనగా, సీత గీతదాటబోవుచుండగా–నాటకశాలలోని పిల్లలందరు ఘొల్లునలేచి గీతదాటవద్దు–గీతదాటవద్దు అని పెద్ద పెద్దకేకలు వేశారట. ఈ గీత రహస్యం మనదేశములో ఎందరికి తెలుసును? మన హిందూ సంస్కృతి రష్యాలోనేగాక, అనేక విదేశములలో చక్కగా వ్యాపించగా మనదేశములో రామభక్తి చాలవరకు క్షీణించుట దురదృష్టము. కనుక మన మందరము నిత్యజీవితములలో నిరంతర దైవజ్ఞప్తితో జీవించుచు, రామనామ స్మరణలో ధన్యులమై గమ్యమును చేరుదుముగాక!

**(శాంతి ఏప్రిల్ 1978)**

**శ్రీరామ శరణం మమ**

నా ఆశయాన్ని క్లుప్తంగా కొన్ని మాటల్లో చెప్పవచ్చు. అదే మానవ కోటికి వారిలోని దివ్యత్వాన్ని గూర్చి బోధించి, వారి జీవిత ప్రతి కార్యకలాపంలోనూ ఆశక్తిని ఎలా అభివ్యక్తం చేయాలో ప్రభోధించడమే.

**స్వామి వివేకనంద**

అర్హత! అర్హత కలిగియుండవలెను. దేనిని అడుగవలసినది లేదు. అర్హతయున్న యెడల సమస్తము అయాచితముగనే పాదముల చెంతకు ఏతెంచి తీరును.

**స్వామి ఓంకార్**

దుఃఖ భాజనమైన నీహృదయాన్ని భగవంతునికై తెరచిఉంచు. విలపిస్తూ "ప్రభూ, నన్ను నీ వైపుకు ఆకర్షించు. మనశ్శాంతి ప్రసాదించు" అని హృదయ పూర్వకముగా ప్రార్థించు. ఆవిధంగా నిరంతరం ప్రార్థిస్తే. క్రమంగా నీకు మనశ్శాంతి చేకురుతుంది.

**శ్రీ శారదామాత**

# భగవత్ కృప

**మూలం : శ్రీ అఖండానంద సరస్వతీ　　　అనువాదం : శ్రీమతి టి. ఛాయాకృష్ణ**

## సత్యమును పరిత్యజించలేదు

శ్రీ శుకదేవుడు పరీక్షితునితో నిట్లనియె – ఈ విధముగా వామనుడు బలిని చాలా తిరస్కారముగా మాట్లాడినారు. కానీ బలి తన ధైర్యమును వదలలేదు – భగవాన్! అవ్లికం వచః (1) నేను మీకు నా దైన్యము లేని వచనమును ఇస్తున్నాను. నేను మీకు నా మనసును ధనమును, తనువును ఇచ్చాను. ఇప్పుడు నేను మిమ్ములను ప్రార్థిస్తున్నాను. నా ప్రతిజ్ఞ మిథ్య కాదు, ఎందుకనగా మీరు వామన రూపములో భిక్షను అడిగారు,త్రివిక్రమరూపంతో కొలిచారు. మీరు మీ ఆ రూపమునే మార్చి వేస్తే ఇందులో నా దోషమేమున్నది?

యద్యుత్తమ శ్లోక భవాన్ మమేరితం
వచోవ్యలీకం సురవర్య మన్యతే ।
కరోమ్యృతం తన్నభవేత్ ప్రలంభనం
పదం తృతీయం కురిశీర్ష్ణిమే నిజమ్ ॥ (2)

ఇందులో 'యది' అనే పదమును ప్రయోగించి బలి అన్నాడు. నా మనసులో అయితే ఇలాగున్నది నా వాక్కు అసత్యము కాలేదు. ఒకవేళ నా మాట అసత్యమయినది అని మీకు అనిపిస్తే నేను శపథం చేసి చెబుతున్నాను నా మాట అసత్యము కాలేదు.

నేను నా వాక్కు సత్య సిద్ధముగా చేస్తాను. నేను మిమ్ములను మోసము చేయను. వంచించను. ఇక్కడ చూడండి! భగవంతుడు తానే చతురుడు అనుకున్నాడు. కానీ బలి ఎటువంటి భక్తుడంటే భగవంతుని కంటే చతురుడయినాడు. అతడిట్లనినాడు– మహాత్మా! ధర్మ ఫలమును మీరు తీసుకునే వున్నారు. నా లోక – పరలోకములు మీ వద్దకు చేరినవి. కానీ ధర్మము యొక్క 'కర్త' అహం మాత్రము మిగిలియే వున్నాడు. దానిని అర్పించకుండా అర్పణ పూర్తి కాదు. అందువలన బలి అన్నాడు ప్రభో! మీరు మీ మూడవ పాదమును నా శిరసుపైన ఉంచండి. దానితో నా శిరసును కొలవండి. ఎక్కడి లోక పరలోకములు? ఎక్కడ నీ చిన్ని శిరసు ఇది నా పాదమునకు చిన్నదవుతుంది అని మీరు అంటారేమో, కానీ అదేమీ కాదు. లోక పరలోకములకంటే పెద్దది ఇది ఎందుకనగా ఆ రెంటిని తయారు చేసేది అదే కదా. నాకు నరక భయమేమీ లేదు. పాశబంధము యొక్క భయము లేదు. ధనహాని యొక్క దుఃఖము లేదు. కానీ ఒక భయము తప్పక వున్నది. సాధువుల సభలో నా వైపు వేలెత్తి ఎవరూ ఇతడు భగవంతునికి ఇస్తానని కూడ ఇవ్వలేదు అని అనరాదు. ప్రభో! మీరు నాకంటే పెద్ద వారు. గురుజనులు దండిస్తూనే వుంటారు. నాకు అనేక ప్రకారముగా అహంకారము. వున్నది. నేను వాటితో అంధుడనై వున్నాను. మీరు ఎంతో కృపతో దానిని దూరం చేశారు. లోకులు మీతో వైరము పూని కూడ ఏకాంత యోగులు పొందే సిద్ధిని పొందుతారు. మీరు నన్ను బంధించి మంచి పని చేశారు. మీరు నా తల్లి తండ్రి గురువు, సఖుడు అన్నీ

మీరే. మా పితామహుడు ప్రహ్లాదుడు మీ భక్తులలో శ్రేష్ఠుడు. అతని తండ్రి హిరణ్యకశివుని మీరు సంహరించినా కూడ అతడు మీ భక్తిని చేశాడు. మీరు నా ఐశ్వర్యమును వదలగొట్టారు, అయితే అయింది మీరు నన్ను మీ శరణాగతుడిగా చేసుకున్నారు, నా అహంకారమును భంగం చేశారు. మీ ఈ లీల అంతా కూడ నా అహంకారమును పోగొట్టుటకే. ఈ విధముగా రాజా బలి ప్రార్థన చేస్తుండగా ప్రహ్లాదుడక్కడికి వచ్చాడు. బలి మొదటిలాగ అతనికి నమస్కరించలేకపోయాడు. ఎందుకనగా అతని కాళ్ళు చేతులు బంధింపబడినవి. దీనివలన బలికి కొంచెం సిగ్గనిపించి – సవ్రీడ నీచీనముఖో బభూవహ (14) నా వల్ల తప్పు జరిగినది. అని నాకు తెలుసు. భగవంతునికి ఈ వస్తువులను నేను దానము ఇస్తున్నాను అని అన్నాను. నా ఎదుటికి వచ్చినప్పుడు అన్ని వస్తువులు భగవంతునివని తెలిసీ, అతడే ప్రభువని తెలిసి కూడ అహంకారంతో నేను చాల తప్పుచేశాను. ఈ స్వర్గము, పృథ్వి, నేను అన్నీ నీకు చెందినవే 'మన నాథ యదస్తి యోస్మ్యహం సకలం తద్ధితవైవ మాధవ'

నేను, నాది అన్నదంతా నీదే ప్రభూ! నాది ఏమైన వుంటే కదా నేను అర్పణ చేయుటకు!? ఎప్పుడైతే నాది అన్నది లేదో, నేను లేనో ఇక అర్పణ ఏమి చేసేది? కానీ నేను అలా అనుకోకుండా అహంకరించితిని. ఆ అహంకారం ఫల స్వరూపముగానే భగవంతుడు నన్ను బంధించినాడు. ఎవరైతే 'నేను' అని అహంకారపడతారో వారికి బంధనము కలుగుతుంది. ప్రహ్లాదుడన్నాడు ప్రభో మీరే ఇతనికి ఇంద్రపదవినిప్పించారు. మీరే ఇంద్రపదవిని లాక్కున్నారు. ఈ విధముగా చేసి మీరు ఇతనిపై చాల అనుగ్రహము చూపించినారు. ఎందుకనగా లక్ష్మి గొప్ప గొప్ప విద్వాంసులను కూడ మోహింప జేస్తుంది. నేను మీకు నమస్కరిస్తున్నాను. శ్రీ శుకదేవుడిట్లనెయె. రాజా! ప్రహ్లాదుని ఎదుట బ్రహ్మదేవుడు కూడ భగవంతునితో ఏదో చెప్పబోయాడు. ఇంతలో వింధ్యావలి వచ్చి ఇట్లు చెప్పసాగినది – అప్పుడు బ్రహ్మ మౌనం వహించాడు. వింధ్యావలిని మాటలాడనిచ్చాడు. వింధ్యావలి ఇట్లన్నది – ప్రభో! ముల్లోకములు మీరు సృష్టించినవే. ఇందులో నేను యజమానిని అనుకునేవాడు. అసత్యము పలికినవారు. సంసార సంబంధమైన ఏ వస్తువునయినా తమది అని అనుకునేవారు నిర్లజ్జులు. అని చెప్పి ఆమె మౌనం వహించినది. అప్పుడు బ్రహ్మదేవుడన్నాడు – ముంచైనం హృత సర్వస్వం' (21) ఇక ఇప్పుడితనిని వధించకండి. వదిలి పెట్టండి. ఇతడు దండయనీయుడు కాదు. ఎందుకనగా ఇతడు తనలోక పరలోకములను మీకు ఇచ్చి వేశాడు. ఇతడు అవిచలమైన బుద్ధితో, ధైర్యముతో తన శరీరమును, ఆత్మను సమర్పణ కూడ చేసినాడు. ఎవరైన మీ చరణములలలో, ధర్భలు, అంకురములు, తులసీదళములు అర్పించినారంటే అప్పుడు వారికి కూడ ఉత్తమ గతి లభిస్తుంది. మరి ఇతని మనసులో ఏ మాత్రము వికలత లేదు. 'అవిక్లవయా' (22) ఇతను తన సర్వస్వమును మీకొసగినాడు. అందువలన ఇతనికి దుర్గతి ఎట్లు కలుగగలదు? భగవంతుడన్నాడు 'బ్రహ్మా! మీరు ఎల్లపుడు ధర్మకర్మము లలోనే నిమగ్నులయివుంటారు. ఇది కూడ కొంచెం చూడండి మా మనసులో ఏమున్నది అని?

**భ్రహ్మన్! యమనుగృహ్ణామి తద్విశో విధునోమ్యహమ్ ।**
**యన్మదః స్థబ్ధోలోకం మాం చావమన్యతే ॥ (24)**

ఎవరిపైన నేను అనుగ్రహము చూపిస్తానో వారి ధనమును లాక్కుంటాను. ఎందుకనగా ధనమదంతో మనష్యుడు అహంకారి అవుతాడు. స్థంభములాగ స్థమయిపోతాడు. వాడు ఇతరులనే కాక నన్ను కూడ తిరస్కరిస్తాడు. భగవంతుడంటాడు – జగత్తులో మదములు అనేకములు కులీనత యొక్క మదము, కర్మ–మదము, వయసు–మదము రూపము యొక్క మదము, విద్యామదము, ఐశ్వర్యమదము, ఒకవేళ వీటి వలన మనుష్యునికి అహంకారము, మదము కలుగకపోతే అప్పుడు అతని పై కృప చాల వున్నదని అర్థము. అహంకారము సంపూర్ణ మంగళములు నశింపజేస్తుంది. బ్రహ్మో! అందుకనే నాశరణాగతుడైన వానిని వీటి నుండి దూరంగా పెడతాను. ఈ బలి చాల శ్రేష్ఠపురుషుడు. ఈతడు మాయపై విజయమును పొందినాడు. దుఃఖములో కూడ ఇతడు మోహితుడవలేదు. ఇతడి ధనము తీసుకోబడినది. స్థానభ్రష్టుడైనాడు, ఇతనిని శత్రువులు బంధించినారు. ఆత్మీయులు – బంధువులు వదిలివేశారు. అనేక ప్రకారములైన యాతనలు కలిగాయి. గురువు కూడ ఇతనిని ఆక్షేపించినాడు – కానీ సత్యప్రేమికుడు తన సత్యమును పరిత్యజించ లేదు. నేను కూడ ఇతనిని వంచించినాను. కానీ ఇతడు నన్ను ఒక్కసారి కూడ ఆక్షేపించలేదు. మీరు నన్ను మోసం చేశారు. నా దాన ధర్మములను ఎందుకు హరించి వేస్తారు అని కూడ అడుగలేదు. అసలు అటువంటి క్లిష్టపరిస్థితులలో సత్యము నెవరు రక్షిస్తారో వారే ధర్మమును రక్షించగలుగుతారు. ఇప్పుడు అతడు వచ్చే మన్వంతరములో ఇంద్రుడవుతాడు. అంత వరకు సుతలలోకములో వుంటారు. అక్కడ ఆధివ్యాధి ఏమీ వుండదు. మరి ఇతడికి నా దర్శనము కలుగుతూ వుంటుంది. దీని తర్వాత వామనుడు 'బలీ! నీవు సుతలలోకమునకు వెళ్ళు అని అజ్ఞాపించాడు. నేను కూడ నీతోపాటు అక్కడికి వస్తాను. నా చక్రము నిన్ను రక్షిస్తూ వుంటుంది. ప్రతిక్షణము నేను నీతోనే వుంటాను' అని పలికెను.

**రక్షిష్యే సర్వతోహం త్వాం సామగం నవరిచ్ఛదమ్ ।**
**సదా సన్నిహితం వీర తత్ర మాం ద్రక్ష్యతే భవాన్ ॥ (35)**

నేను ఇప్పుడు నీ కాపలావానిగా వుంటాను. ఎప్పుడూ నీ కళ్ళ ఎదుటనే నిలచి వుంటాను. నీ మనసులో ఆసురీభావము వుండదు. మరి నీకు నా దర్శనము. ప్రాప్తమవుతూ వుంటుంది. ఇప్పుడు చెప్పండి ఇంద్రునిపైన భగవంతుని కృప కలిగినదా లేక బలిపైన కృప కలిగినదా? అందుకని ఒకచోట బలి అంటారు. ఇంద్రునికి తన హితవేమిటో తెలియదు. ఎందుకనగా అతడు స్వర్గములో కూడ కష్టమిననుభవిస్తున్నాడు. మరి ఇక్కడ భగవంతుడు మా ఇంట వున్నాడు.'

(సశేషం)

# తత్త్వమసి

శ్రీ తెన్నేటి విశ్వనాథం

(క్రిందటి సంచిక తరువాయి)

## రంగము

ముని॥ స్వామీ, మీరు చిత్పదార్ధమునుండి తేజస్సు ఉదయించినదని అనుచున్నారు. అరుణ మహర్షులు ఆకాశ ముద్భవించినది మొదటనని అన్నారు. దీని అంతరార్ధము?

ఉ॥ ఇప్పుడు మనము సృష్టిక్రమము విచారించలేదుగద ఆ విషయములో ఆ వరుస ప్రసక్తమగును. మూర్తి మంతమయిన వస్తుజాలము తేజస్సు, ఉదకము, అన్నము (అనగ) పృధివి అంశముల వలన సంజనితమై సర్వమునకు అధిష్ఠానమైన చిదంశయొక్క వీక్షణా సంకల్పముచే సముద్భవించినది అని చెప్పుట అయినది.

శ్వే॥ ఇంతకును తేజస్సునందు వాయువు ఆకాశ అంశలు కలిసియేయున్నవి కాబోలు.

ఉ॥ సరిగ గ్రహించితివి నాయన వీటికీవిషయమున జీవ భూతసృష్టి జరుగుచున్నది. అన్నియు చిదా భాసములే. ఉపాధులననుసరించి నామరూప భేదములు మనము కల్పించినవి. కారణము మాత్రము ఒక్కటియే. అదియే. ఆత్మ. ఆ ఆత్మయే నీవు.

మనులు॥ ఉద్దాలక మహర్షీ। మరి తేజస్సు ఉదకము పృధివి అని మూడింటిని చెప్పినారు, వీటిని ప్రత్యేకించి...

ఉ॥ అర్ధమగుటకు ప్రత్యేకముగ జెప్పితిని. ఆకాశగుణము వాయువునందుండును.

ఆకాశవాయుగుణములు తేజస్సునందుండును.

ఆకాశ వాయు తేజోగుణములుదకమునందుండును.

ఆకాశవాయు తేజోదక గుణములు పృధివియందుండును.

అనగ

శబ్దగుణము వాయువునందు

శబ్దస్పర్శలు తేజస్సునందు

శబ్దస్పర్శ ఉష్ణగుణములు ఉదకమునందు

శబ్దస్పర్శ ఉష్ణరసగుణములు పృధివి యందుండును.

శ్వే॥ దీనికి ప్రమాణము?

ఉ॥ ప్రత్యక్షానుమానములే. మనకతీంద్రియమైనవాటికి అతీంద్రియశక్తి సంపాదించిన పెద్దలయొక్క నిర్వచనములుకూడ ప్రమాణములే. నీ శిష్యులకు నీమాట ప్రమాణమైనట్లు వారిమాట నీకు నాకు ప్రమాణము.

ము॥ సత్యము, సత్యము.

శి॥ పెద్దలు, ఆప్తకాములు తప్పులెందుకు చెప్పుదు రయ్యా! ఎవ్వరినీ వారు మెప్పించ నక్కరలేదు కదా!

శ్వే॥ నిజము. అంతే, అయితే ఆ గుణములను ఏరీతిగ గ్రహింపగలుగుదుము.

ఉ॥ వైశేష్యాత్తు తద్వాదఃఅను న్యాయమున్నది గద. అందుచేత.

ఆకాశప్రధానమైనదానిని ఆకాశమందుము.

వాయుప్రధానమైనదానిని వాయువని అందుము.

తేజఃప్రధానమైనదానిని తేజస్సని అందుము.

ఆలాగుననే ఉదక ప్రధానమైనదానిని ఉదకమనిన్నీ

పృథివీ ప్రధానమైనదానిని పృథివిఅనిన్నీ అందుము.

శ్వే॥ అనగ ప్రతిపదార్ధమందున ఇవి కలిసియే ఉన్నవని అనుకోవచ్చునా?

ఉ॥ ఆం, నీకు కనిపించెడి లోకమంతయు; ఈ మూడింటితో (అయిదింటితో అనుకొనుము కావలసిన యెడల)
కూడుకొనియున్నదే.

మనులు॥ ఏలాగు ఇది ఇదీఅని తెలిసికోగలము మహర్షీ।

ఉ॥ అగ్ని నీకు ప్రత్యక్షముగా కన్పించుచున్నదిగదా!

ము॥ చిత్తము.

ఉ॥ అందులో ఎర్రగనున్న దేదియో అది తేజస్సు యొక్క రూపం. తెల్లగనున్న దేదియో అది ఉదకమయొక్క రూపం. నల్లగనున్న దేదియో అది అన్నముయొక్క రూపము.

ఈ మూడింటికి వేరుగ అగ్నియనే పేరున్ను అగ్నియనే ద్రవ్యమున్ను కల్పితములు, వాగ్వ్యాపారములు.

శ్వే॥ మరి. సూర్యుడు

ఉ॥ సూర్యునియందు ఎరుపుగ నున్నదేదియో అది తేజస్సుయొక్క రూపము. తెల్లగనున్న దేదియో అది ఉదకముయొక్క రూపము.

నల్లగనున్న దేదియో అది పృథివియొక్క రూపము.

సూర్యుడు అన్నపేరు కల్పితము, వాగ్వ్యాపారము.

శ్వే॥ అయితే, చంద్రునియందు, విద్యుత్తునందున్నూ ఉన్న స్వరూపములు అంతేనా?

ఉ॥ అవును నాయనా అవును. ఆలాగుననే అన్ని ద్రవ్యముల విషయముకూడ అర్ధముచేసికొమ్ము.

శ్వే॥ మనము తినెడి అన్నము ఒక్క ద్రవ్యముకదా! దానియందును ఇటులే అనుకొనవలెనా?

ఉ॥ అంతే, అంతే, అదియే అదియే పచ్యమానమై మూడుభాగములై పరిణామమును పొందుచున్నది. ప్రత్యేక నామరూపభేదముల పొందుచున్నవి. అవి కల్పితములు వాగ్వ్యాపారములు.

శ్వే॥ కొంచెము వివరింతురా?

ఉ॥ ఎదురుగ స్పష్టముగ కన్పించుచున్నదే. వివరము దేనికి? చూడు

తినిన అన్నములో
స్థూలాంశవిసర్జనీయము
మధ్యమాంశము మాంసముగ
సూక్ష్మాంశము మనసుగ పరిణమించును.
త్రాగిన జలములో
స్థూలమైనది విసర్జనీయము
మధ్యమాంశము రక్తముగ
సూక్ష్మాంశము ప్రాణముగ పరిణమించును.
తేజో రూపములగు
ఘృతాదికములు
భక్షితములయిన
స్థూలాంశ అస్థులు
మధ్యమాంశ అస్థులసంధించు చమురుగ
సూక్ష్మాంశ వాక్కుగ పరిణమించును.

శ్వే॥ అనగా 1. మనస్సు అన్న వికారము
2. ప్రాణము ఉదక వికారము
3. వాక్కు తేజో వికారము.

ఉ॥ సరిగనే అర్ధము చేసికొంటివి. అవును, అవును,
ఈ పూటకు ఇంతవరకు మననము చేసికొనుడు.

శ్వే॥ ఇంకను తెలియగోరుచున్నాను.
పురుషుడు భక్షించు తేజస్సు, అపస్సు అన్నముల
సూక్ష్మాంశములె వాక్కు ప్రాణము మనస్సు, రూపములు అని చెప్పియుంటిరిగద!

ఉ॥ అవును చెప్పియుంటిని.

శ్వే॥ ఏకీభవించి వాక్కు ప్రాణమనోరూపములుగద – అట్లయినచో వేరుగ మనస్సు అన్న వికారము అని చెప్పుట యెట్లు పొసగును నాయనగారు!

ఋ॥కు॥ చిత్తము స్వామీ మాకును అదియే అవగాహన కాలేదు.

ఉ॥ ఆలాగునా? ఉదకములు ప్రాణ వికారములు, మననము చేయుచు, పదునైదు దినములు ఉదకము సేవించుచు పదియారవదినము సూర్యోదయానంతరము నాకడకురమ్ము. దీర్ఘాయుష్యమస్తు.

(అందరు లేతురు. వారు నమస్కరించుచుండగ తె ర ది గు ను.)

(సశేషము)

# శ్రీ తులసీ సర్వస్వము

జి.వి.యస్. సుబ్రహ్మణ్య శాస్త్రి

## బి. అర్ఘ్య ప్రదాన మంత్రము

**శ్లో॥ శ్రియః శ్రియే! శ్రియావాసే! నిత్యం శ్రీధరసత్కృతే।**
**భక్త్యా దత్తం మయా దేవి! అర్ఘ్యం గృహ్ణ నమోస్తు తే॥**

లక్ష్మికి లక్ష్మీత్వమును, సౌందర్యమును ఇచ్చుదానా! లక్ష్మికి నివాస స్థానమైనదానా! ఎల్లప్పుడు శ్రీధరునిచే గౌరవింపబడుదానా! నా చేత సమర్పింపబడిన ఈ అర్ఘ్యమును స్వీకరింపుము. నీకు నమస్కరించుచున్నాను.

## సి. తులసీకాననమహిమ

**శ్లో॥ రతిం బధ్నాతి నాన్యత్ర తులసీకాననం వినా।**
**దేవదేవో జగత్స్వామీ కలికాలాత్ విశేషతః॥**
**హిత్వా తీర్థసహస్రాణి సర్వానపి శిలోచ్చయాన్।**
**తులసీకాననే నిత్యం కలౌ తిష్ఠతి కేశవః॥**
**నిరీక్షితా నరై ర్యాతు తులసీవనవాటికా।**
**రోపితా యాచ విధినా సంప్రాప్తం పరమం పదమ్ ॥**
**న ధాత్రీ సఫలా యత్ర న విష్ణు స్తులసీవనమ్ ।**
**తత్ శ్మశానసమం స్థానం సంతి యత్రచ వైష్ణవాః॥**

(స్కాందపురాణము)

దేవదేవుడును, జగత్స్వామియును అగు శ్రీ మహావిష్ణుము తులసీవనమునందు తప్ప మరి ఏ ఇతర ప్రదేశములయందును నివసించుటకు ఇష్టపడడు. ముఖ్యముగా కలికాలమునందు వేలకొలది ఇతరతీర్థములను పవిత్రముతైన పర్వతములను, విడిచిపెట్టి, కేశవుడు తులసీవనమునందే నిత్యము నివసించుచుండును.

తులసీవనవాటికను, భక్తిశ్రద్ధలతో ప్రవేశించి, దర్శించినవాడును, తన ఇంటిలో నాటినవాడును, తప్పక పరమపదమునకు చేరుకొనును.

ఏ ప్రదేశమునందు విష్ణువుగాని, తులసీవనముగాని ఉండదో, ఆ భూభాగము నిరర్థకమైనది. నిష్ఫలమైనది అగును. పైగా తులసియును, తులసీ విష్ణువును లేని ప్రదేశము శ్మశానముతో సమానమైన అపవిత్రమైన భూమియగును అని స్కాందపురాణము పేర్కొనుచున్నది.

**శ్లో॥ కేశవార్థే కలౌ యే తు రోపయంతీహ భూతలే॥**
**కిం కరిష్య త్యసంతుష్టో యమోపి సహకింకరైః॥**

(స్కాందపురాణము)

కేశవుని పూజకొఱకు కలియుగమునందు ఏ మానవులు భూమిపై తులసీ వనమును నాటుదురో అట్టివారిని యమకింకరులతో కూడిన, కోపించిన యముడు కూడ ఏమి చేయగలడు? కాలయముడు కూడ తులసీవనమును పెంచి, పోషించిన వానిని, ఏమియు చేయలేడని భావము.

## తులసి పూజకు అందరూ అర్హులే

**శ్లో॥ చతుర్ణామపి వర్ణానాం ఆశ్రమానాం విశేషతః॥**
**స్త్రీణాంచ పురుషాణాంచ పూజిత స్త్వం దదాసి హి॥**

(అగత్స్యసంహిత)

1.బ్రహ్మణ, 2. క్షత్రియ, 3. వైశ్య, 4. శూద్రులను నాలుగు వర్ణముల వారిచేతను 1. బ్రహ్మచారి, 2. గృహస్థుడు, 3. వానప్రస్థుడు, 4. సన్యాసి అను నాలుగు ఆశ్రమముల వారిచేతను, స్త్రీలచేతను, పురుషులచేతను కూడ పూజింపబడినదై, ఈ తులసీదేవి వారి వారి అభీష్టములను నెఱవేర్చుచుండును.

## తులసీకాననపూజను చేసినవాడు ముక్తి నందును

**శ్లో॥ తులసీ కాననంచైవ గృహే యస్యైవ తిష్ఠతి।**
**తద్ గృహం తీర్థభూతంహి, నాయాన్తి యమకింకరాః॥**
**తులసీ మంజర్యాదిభిః యః కుర్యా ద్ధరిహరార్చనమ్।**
**న స గర్భగృహం యాతి ముక్తిభాగీ భవే న్నరః॥** (పద్మపురాణం)

ఎవని ఇంటిలో తులసీవన ముండునో, ఆ గృహము పుణ్యతీర్థమైపోవును. కనుక ఆ ఇంటికి యమకింకరులు చేరలేరు.

అట్లే హరిని, హరుని (శివుని) తులసీమంజరులతో పూజింపవలెను. అట్టి భక్తుడు మఱల మాతృగర్భమను గృహములోనికి ప్రవేశింపడు. అనగా ముక్తిని పొందును.

## తులసీదళము

మనము చేయు నిత్యపూజలలో తులసీదళమున కెంతయో ప్రాముఖ్యమున్నది. తులసీదళములతో భగవంతుని కభిషేకమును నిర్వర్తింతురు. ఆ దళములను వేసికొని మానవులు కూడ పవిత్ర స్నానము నాచరింతురు. తులసివేసిన తీర్థమును గ్రహింతురు. భగవదర్పితమయిన, వండిన అన్నమును ఆ దళము మహాప్రసాదముగా మార్చును. ఆ దళమును వేయని పదార్థమును భగవంతుడు స్వీకరింపడు. ఆ దళము మహౌషధము, కఫహారి, చర్మరోగవినాశిని, ఎన్నియో రోగముల కద్భుతమైన పరమౌషధము. కనుకనే కొందరు తులసీదళములను భక్షించుచుందురు.

మరణమునందు తులసీతీర్థ మిచ్చుట మన కందరకు తెలిసిన విషయమే కదా.

ఇన్ని సుగుణములున్న ఆ తులసీదళమాహాత్మ్యమును ఇక కొంత పరికింతము.

## తులసీదళజలములతో భగవంతుని కభిషేకముచేయుట

**శ్లో॥ సుస్నాతః సర్వతీర్థేషు సర్వ యజ్ఞేషు దీక్షితః।**
**తులసీపత్రతోయేన యోభిషేకం నమాచరేత్॥**

తా॥ తులసీదళములు కలిపిన నీటితో ఎవడు భగవంతునకు అభిషేకము సమర్పించునో అతనికి సర్వతీర్థములయందు విధివిధానముగా స్నానము చేసిన ఫలితము దక్కును. అట్లే సర్వయజ్ఞములను దీక్షతో నిర్వహించి వానికి వచ్చు ఫలితము కూడ లభించును. అని దీని భావము.

**రహితాం పూజాం న గృహ్ణాతి సదా హరిః।**
**కాష్ఠంవా స్పర్శయే త్తత్ర నోచేత్ న స్నాతవాన్ భవేత్ ॥**

(వాయుపురాణము)

తులసీదళములేని పూజను హరి ఎన్నడును స్వీకరింపడు అందువలన తులసీదళము దొరకనప్పుడు అభిషేకజలములో కనీసము ఎండిన తులసీకాష్ఠమునైనను తగిలించి తులసీసంబంధమును ఆ జలమునకు కల్పింపవలెను. ఇట్లు చేయనిచో ఆ అభిషేకము అభిషేకమే కాదు.

**శ్లో॥ తులసీదళ మాదాయ యోన్యం దేవం ప్రపూజయేత్ ।**
**బ్రహ్మహా స హిగోఘ్నశ్చ స ఏవ గురుతల్పగః ॥**

(వాయుపురాణము)

తా॥ తులసీదళమును చేతితో పట్టుకొని విష్ణువునుకాక, ఇతర దేవతను ఎవడు పూజించునో, వాడు బ్రహ్మహత్యను, గోహత్యను చేసిన వానికి కలుగు పాపము నందుటయే కాక, గురుభార్యతో సంగమించినవానికి కలుగు పాపమును కూడా పొందును. అని వాయుపురాణము పేర్కొనుచున్నది. తులసిని విష్ణుపూజకు తప్ప ఇతర దేవతల పూజకు ఉపయోగింపరాదని భావము.

నిత్యము తులసీతీర్థమును (చరణామృతమును) స్వీకరించుటవలన ఫలము

**శ్లో॥ నిత్యం యః తులసీతోయం భుంక్తే భక్త్యా చ మానవః।**
**లక్షాశ్వమేధజం పుణ్యం సంప్రాప్నోతి స మానవః॥**

తా॥ ఏ మానవుడు భక్తితో నిత్యము తులసీతీర్థమును స్వీకరించునో, ఆ మానవుడు లక్ష ఆశ్వమేధయాగములు నిర్వహించుటవలన కలుగు పుణ్యమును పొందును.

**శ్లో॥ సుధాఘటసహస్రేణ న తృప్తి ర్హి భవే ద్ధరేః।**
**యా చ తృప్తి ర్భవే న్నూనం తులసీపత్రదానతః॥**

తులసీపత్రమును దానము చేయుటవలన విష్ణువునకు నిజముగా తృప్తి కలుగునో, అది అతనికి వేలకొలది అమృతఘటములతో అభిషేకించినను కలుగదు.

# పిపాజి రాజు చరిత్రము

## భాగవతోత్తములను ఆశ్రయించిన వారికి దేహభ్రాంతి తొలగును

మంగ పటమనే గ్రామమును పిపాజిరాజు పాలించుచుండెను. అతడు, భగవద్గీతలో చెప్పినట్లు శౌర్యము, తేజము, ధైర్యము, సారమర్థ్యము, యద్ధము నందు పారిపోకుండా పోరాడడం, దానము, పరిపాలనా దక్షత మొదలైన క్షత్రియ లక్షణములు కలవాడు. అతడు కాళికాదేవిని నిరంతరము శ్రద్ధతో ఆరాధించెడివాడు. ఆ దేవి కృపవల్ల ఇహలోక సుఖాలకు కొరత లేకుండ అనుభవించుచున్నవాడు. ప్రతీరోజు తెల్లవారకుండా లేచి స్నానసంధ్యావందనాది నిత్యకర్మలను చేసుకొని, సకల ఉపచారములతో కాళికాదేవిని పూజించి, మహానైవేద్యమును నివేదించును. అప్పుడాదేవి స్వయముగా వచ్చి దానిని భుజించు చుండెను. తర్వాత ఆ దేవికి తాంబూల మిచ్చి ప్రదక్షిణ నమస్కారములు చేసిన తర్వాతనే ఆ రాజు తన ఆహారమును తీసుకొను చుండెను. ఒకరోజు ఆ పట్టణమునకు శాంతస్వభావులు, కోపమును విడచినవారు, సర్వభూతములను సమానముగా చూచువారు, సాధువులు ఐన కొందరు మహాత్ములు తీర్థయాత్రలు చేయుచు ఆ మహారాజు సుకృతము వలన వచ్చిరి. గుణవంతుడైన ఆ రాజు వారికి సర్వోపచారములు చేసి, కావలసినన్ని ఆహారపదార్థముల నిచ్చెను. తరువాత తన నిత్యకాళికాపూజ ప్రారంభించెను. కాని నివేదనను ఆరగిచుటకు కాళికాదేవి రాలేదు. చింతాక్రాంతుడైన మహారాజు దీనముగా ప్రార్థించిన ఆ దేవి ప్రసన్నురాలయ్యెను. ఆమె రాజుకు యిట్లు బోధించెను.

రాజా! పట్టణమునకు వచ్చిన సాధువులు (మహాత్ములు) భుజింపకుండా నేను భుజింపను. వారు భగవంతునికి మిక్కిలి ప్రియమైనవారు. అట్టి భగవత్ప్రియుల దర్శనము చాల దుర్లభము. వారు ఎట్టి కోరికలు లేని వారు. కేవలము నీ భోజనము కొరకు యిచ్చుటకు రాలేదు. నీవు పూర్వజన్మలో చేసుకున్న పుణ్యము వలన వారిని చూసి పూజించు అదృష్టము కలిగెను. ఈ సంసార విషవృక్షమునకు రెండు అమృత తుల్యమైన పండ్లు కలవు. తనను ఆశ్రయించినవారిని, దూషించిన వారిని సమానముగా చూచు కేశవుని యందు ఎప్పుడు భక్తి కలిగి యుండుట ఒకటి, ఆ కేశవుని భక్తులతో కలియుట అనెడిది రెండవది. ఈ రెండిటిలో రెండవ ఫలమే గొప్పది. నీ గొప్ప అదృష్టముచే నీకీ ఫలము దక్కినది. ఈ ఫలము లభించిన వారికి మిగిలిన పుణ్యము లన్నియు చేతిలో ఉసిరిక వంటివి. భ్రమరము కీటకమునకు తన రూపు నిచ్చునట్లు, ఆ భాగవతోత్తములు తమను ఆశ్రయించిన వారిని తమ హితోపదేశములచే తమవలె దేహభ్రాంతి లేని వారివలె చేయుదురు. నిస్పృహలకు ఈశ్వరుడు అధీనుడై యుండును. ఈశ్వరుని స్వాధీనములో ఉంచకున్నవారికి మోక్షము కరతాలామలకము కదా! నా

ఆరాధాన వలన నీకు ఐహిక భోగములను పూర్ణముగా అనుగ్రహించితిని. ఇక ఇహలోక సుఖములను త్యజించి శాశ్వత సుఖమునకై ప్రయత్నించుము. శరీరము నీటిబుడగ వంటిది. జన్మించిన వారు మరణించుట తథ్యము మనుష్యుడు, చిరిగిన వస్త్రమును వదలి కొత్త బట్టను కట్టినట్లు, జీవుడు ముసలిశరీరమును విడచి, నూతన దేహమును పొందును. ఇట్టి శరీరములలో మానవజన్మకలుగుట దుర్లభము, అందు జ్ఞానవంతుడగుట మరీ కష్టము. ఈ జ్ఞానము లౌకిక విషయములందు గాక భగవంతుని చింతనలో ఉపయోగపడుట అంతకన్నాదుర్లభము. విషము కన్న ప్రలోభములు క్రూరమైనవి. విషమునకు, విషయములకు చాలా బేధమున్నది. విషము తనను తిన్నవారినే చంపును. కాని ప్రపంచ ప్రలోభములు తనను తలచినంతనే జనులను చంపును. పాము నోటిలో చిక్కిన కప్పకూడ తన ఎదుటనున్న పురుగును తినుటకు ప్రయత్నించునట్లు మృత్యుముఖమునున్న మనుష్యుడు కూడ ప్రాపంచిక విషయములను కోరుచున్నాడు. నీవు బుద్ధిమంతుడవు కావున నా హితోపదేశమును వని, మోక్షమునకు ఆటంకమైన ప్రాపంచిక సుఖములను విడచి, పరమ పురుషార్థమైన మోక్షసిద్ధి కొరకు భగవంతుని ఆశ్రయింపుము. జీవకోటిలో నుండు, అల్పశక్తివంతులమగు మావంటి దేవతలను ఐహిక సుఖములనే యివ్వగలము గాని మోక్షమును యిచ్చుటకు అసమర్ధులము. బ్రహ్మాండములోని అన్నిలోకములు పునర్జన్మనిచ్చునవే తనను చేరిన వారికి పునర్జన్మలేదని భగవద్గీతలో భగవంతుడు చెప్పియున్నాడు. కనుక నీవు పునర్జన్మలేని మోక్షసిద్ధికై దేవదేవుని ఆశ్రయింపుము. దీనికొక వుపాయము చెప్పెదను. జ్ఞానవైరాగ్యములు కలిగిన భగవద్భక్తులనాశ్రయించిన వారు హితోపదేశము చేసి, నీ అజ్ఞానమును తోలగించి సదాచార్యులతో సంబంధమును కలుగ చేయుదురు. జ్ఞానానుష్ఠాను సంపన్నుడైన ఆచార్యుని ఆశ్రయించిన వారికి భగవంతుడు తానే మోక్షమునిచ్చును. పైకి కనపడని వైరాగ్యము మొదలైన గుణములు గల భాగవతులను గుర్తించుట, వారిని సేవించుట కడుదుర్లభము. అటువంటి భాగవతులు ఎంత దూరమున వున్నను, వారిని వెదకి, వద్దకు వెళ్ళి ఆశ్రయింపవలెను. నీ గొప్ప అదృష్టముచే వారే నీ పట్టణమునకు వచ్చితిరి. ఇంక ఆలస్యము చేయకుము. శుభస్య శీఘ్రమను నట్లు వేగముగా వారి సన్నిధికి పొమ్మని చెప్పెను. రాజు ఎంతో తృప్తి పొంది, ఆ దేవికి నమస్కరించి ఈ సదుపదేశము వలన నీవే నామొదటి గురుమూర్తివి. ఇది ఇన్నాళ్ళ నీ ఆరాధనా మహాఫలము కృతార్ధుడను. నీవు ఆజ్ఞాపించినట్లే చేసెదనని బయలుదేరెను.

పిపాజిరాజు భాగవతుల సన్నిధికి వచ్చి వారి పాదములకు దండప్రణామములు చేసి చేతులు జోడించి సవినయముగా యిట్లనెను. నా దేవతలారా! శ్రీరామ చంద్రుడు శృంగిబేరపురమునకు వెళ్ళి గుహానికి తన సేవ చేయు భాగ్యము యిచ్చినట్లు నేను కోరకుండగనే నా అదృష్టముచే మీరు యీ పట్టణమునకు వచ్చి మీసేవా భాగ్యము

కల్పించితిరి. మహాత్ముల సేవ వ్యర్థము కాదు. ఇంతవరకు నేను కాళికా దేవి ఆరాధనా ప్రసాదము వలన కలిగిన ఐహిక సుఖములనే మోక్షసుఖముగా తలచితిని. నేడు ఆ దేవికృపతో నాకు విరక్తి మార్గము ఉపదేశించి, మీ సన్నిధికి పంపినది. నాకు భగవత్సాక్షత్కారము కలుగునట్లు దయచూపించుడు అని ప్రార్థించెను. వారు కరుణించి నీవు వినియసద్గుణరాశివి. అన్నివిధముల, సంసారబంధవిమోచనుడగు శ్రీమన్నారాయణుని స్మరించినంత మాత్రమున, సర్వపాపములు తోలగి సకల శుభములు కలుగును. కావున మహాత్ములు ఎల్లవేళల ఆభగవంతుని స్మరణలోనే జీవించుచుందురు. సర్వభూతాంతర్యామి అయిన నారాయణుని యందు నీకు స్నేహభావము కలుగుగాక! ఆ జగదీశుని లీలలను కీర్తించు సాధువులతో నీవు స్నేహము చేయుము. అందువలన మోహాది సర్వక్లేశములు నశించును. ప్రపంచములో, తాపత్రయముతో దుఃఖపడుచున్న కరుణించదగిన ప్రాణులను బుద్ధిమంతుడు ద్వేషించిన వానికి హానియే కలుగును. కావున జీవుల యడ మాత్సర్యము కూడదు. వివేకి తన్ను అసూయచే ద్వేషించే వారిని చూచి, వారు అజ్ఞానమున మునిగి యున్నారని, ఎన్నిటికి దరిచేరగలరని పరితపించును. జ్ఞానానుష్ఠాన సంపన్నుడగు సదాచార్యుని ఆశ్రయించిన అతడు నీకు ఉత్తమాధికారి లక్షణములను ఉపదేశించి, అందు ఉత్తమునిగా జేయును, జ్ఞానము, అనుష్ఠానము అనెడి రెండు రెక్కలున్న పక్షివలే, ఆకాశమనెడి భగవంతుని చేర్చును. అట్టి ఆచార్యుడు లభించుట మిగుల దుర్లభము. ఇప్పుడు కాశీ పట్టణములో శ్రీరామానందస్వామి అను యతీశ్వరుడు పూర్తి ఆచార్యలక్షణములతో కూడియున్నాడు. భగవతాగ్రగణ్యుడగు కబీరుదాసు మొదలగు తుమ్మెదలు ఆ గురుపుంగవుని పాద పద్మములనా శ్రయించియుండెను. నీవు ఆ దేశికోత్తముని నాశ్రయించి, ఉపదేశమును పొంది ఆయన చెప్పిన, చూపిన మార్గము నందు నడచిన, నీకు భగవత్సాక్షాత్కారము కల్గును అని చెప్పి అనుగ్రహించి అచ్చటి నుండి వెడలిరి.

తరువాత రాజు సర్వసంగ పరిత్యాగము చేసి భార్యతో కాశీకి పోయి శ్రీరామానందస్వామిని ఆశ్రయించెను. ఆ గురుపుంగవుడు అతని ఆస్తికగుణములకు సంతోషించి శ్రీ తారక మంత్రము నుపదేశించెను. "రాజా నీకు కాళికాదేవి ప్రథమగురువై జ్ఞానదీపమునిచ్చెను. దానికి నెయ్యివలె భగవద్భక్తుల ఉపదేశము దానిని ప్రజ్వలింప జేసెను. తారక మంత్రోపదేశమను అనుకూలవాయువు ఆ దీపమును దావాగ్ని చేసి, నీవు జన్మజన్మలనుండి కూడబెట్టిన నీపాపారణ్యమును భస్మము చేసెను. నీవిపుడు మిగుల పరిశుద్ధుడ వైతివి. సంసార విషయములనెడి శత్రువులచేతనుండి తప్పించుకొని భగవంతుని కటాక్షమునకు పాత్రుడవైతివి. సర్వదేశ, సర్వకాల, సర్వావస్థలయందును మనసుచే భగవంతుని ధ్యానించుచు, వాక్కుచే భగవన్నామముచ్చరించుచు, కాయముచే ప్రదక్షిణ వందనార్చనాది భగవత్సేవలను చేయుచు, వైరాగ్యశీలురగు భాగవతులతో సల్లాపసహవాసములు చేయుచు ఇతర

విషయములందు ఆసక్తిలేనివాడవై నడచిన భగవంతుడు నీ మనోవీధిని సంచరించుచు నిన్ను ఎడబాయ కుండును. జ్ఞానవంతులు సకల భూతములను తనవలె. అభేదముగా భావించవలెను. నీవు భేద భావము విడచి పరమానందస్థితికి ప్రయత్నింపుము, భగవంతుని తప్ప తక్కినవారిని ఉపాసించిన నీకు పరమసిద్ధి కలుగదు. దేవాసుర యక్షరాక్షస కిన్నెర పన్నగాదులచేతను, మనుష్య పశుపక్షి మృగములచేతను, అతిసార జ్వర గుల్మాది మహారోగముల చేతను, రాగద్వేషలోభమోహ మదమాత్సర్యముల చేతను నాశనము చెందని పరమానంద సిద్ధికై శ్రీకేశవుని పాదపద్మములను నీ హృదయమునందు నిలుపుము. కావున అంతులేని సంసారములో కలుగు దేవమనుష్యాది శరీరములను అనుభవించదగు స్వర్గాది భోగములకు ఆశపడకుము. నీకు అన్నిటికన్నా గొప్పదైన పరమార్ధమును ఉపదేశించెదను. సర్వభూత సమత్వమే అచ్యుతునికి ముఖ్యరాధనము. సమత్వభావము లేక చేయు ఆరాధనము బూడిదకర్పించిన నెయ్యి అగును. సర్వ భూత సమత్వ భావముతో చేయు ఆరాధనతో సర్వేశ్వరుడు ప్రసన్నమైన లభించనివే యుండవు. ధర్మార్థకామములు అల్పఫలప్రదములు. మోక్షము సహితము నీవు కోరనవసరము లేదు. పండ్లుగల మామిడి చెట్టు క్రింద చేరిన వానికి కోరకనే పండు దొరికినట్లు, పరబ్రహ్మమను మహావృక్షమును ఆశ్రయించిన మోక్షానంద ఫలము తనంతట తానే సిద్ధించును. దీనికి సందేహము లేదు అని ఉపదేశించెను.

ఆ రాజు శ్రీరామానందస్వామి ఉపదేశానుసారము సర్వ పదార్ధములను భగవద్రూపములుగా భావించుచు అతని అనుమతితో ద్వారకకు పోయెను. అచట శ్రీవాసుదేవ పరబ్రహ్మమును దర్శించి వందనములు చేసెను. ఎన్నోజన్మలను పొందియు నిన్ను తెలుసుకొనలేక విషయ సుఖములలో చిక్కి యమునికి వశుడనైతిని. దుర్లభమైన మానవజన్మ లభించినను ప్రాపంచిక సౌఖ్యములకై కాళికాదేవి నుపాసించితిని. ఆ దేవి నాకు గురువై వైరాగ్యము నుపదేశించి భాగవతుల సన్నిధికి పంపెను. వారు ద్వేషమును పోగొట్టి, సాక్షాత్తు భగవత్ స్వరూపుడగు జ్ఞానానుష్ఠాన సంపన్నుడగు శ్రీరామానంద స్వామి పాదముల చేర్చిరి. ఆ దేశికోత్తముడు శ్రీతారకమంత్రమును నాకుపదేశించి సర్వభూత సమభావము కలుగ జేసి నన్ను నీవానిగా చేసెను. అనాదిగా ఇంద్రియములకు సేవకుడనై నేను చేసిన తప్పులను మన్నించి, యిక నిముషమైన నిన్ను మరువకుండునటుల అనుగ్రహింపుమని వేడుకొనెను.

తనభక్తుని ప్రార్థనకు సంతసించి శ్రీవాసుదేవుడు ప్రత్యక్షమై పిపాజిరాజు సేవను స్వీకరించి నీవు నామదేవుడు మొదలైన వారివలె నా అంతరంగ భక్తుడవు. శ్రీ రామానంద గురువు డపదేశమార్గమున ధృఢముగా నిలువుము. నేనెల్లప్పుడు నీహృదయము నందే వుండెదనని అనుగ్రహించెను.

పిపాజిరాజు ద్వారకలో నాలుగు మాసములుండి భగవదాజ్ఞానుసారము కాశీకి వచ్చుచుండగా అరణ్యమధ్యమున ఒక పులి గర్జించుచు మీదకువచ్చెను. రాజుభార్య భయపడి పులి వచ్చుచున్నదనెను. అప్పుడు రాజు భయపడవలదు. సాక్షాత్తు భగవంతుడు వచ్చుచున్నాడు. అన్ని కదిలెడి కదలని వస్తువులలోను ఆ భగవంతుడు ప్రవేశించి వున్నాడు. నీవు పులిలో దైవమును కాంచ నందున నీహృదయ మింకను పరిపక్వము కాలేదు. కవచము ధరించిన పురుషుని పురుషునిగా భావించవలెను గాని అతను ధరించిన కవచముగా భావించరాదు. అట్లు భావించుట అజ్ఞానము. చేతనా చేతనములన్నింటిని తన కవచముగా ధరించు భగవంతుని, ఈశ్వరునిగా తలంచక తెలివితక్కువగా పులిగా చూచు చుంటివి. శ్రీరామానంద స్వామి యిచ్చిన జ్ఞానమనే వెలుతురులో చూచిన అజ్ఞానము నశించి, బెబ్బులి యందు భగవంతుని గని తరింతువనెను.

తమ వద్దకు వచ్చి నిలుచున్న పులిని జూచి నీస్వభావమును విడచి ఏకాంతస్థలమందు వుండి, భగవంతుని రూపములైన ఏవక్క ప్రాణిని హింసింపక, చెట్లనుండి రాలిన ఆకులను ఆహారముగా తీసుకుని సదా భగవంతుని ధ్యానించుము. ఇంద్రియములకు లోబడక నీ హృదయములోనున్న భగవంతుని ఉపాసింపుము అని దయతో తనపాద పద్మములపై బడిన ఆ పులిని లేవనెత్తి తన కంఠమునున్న తులసిమాలను దాని మెడలో వేసి దాని శిరసుపై తన చేతినుంచి భగవన్నామమును దాని చెవిలో ఉపదేశించెను. శ్రీధరుడు మన స్వామి సమస్తలోకుల దురవలాట్లను సమూలముగా పోగొట్టువాడు. ఒక దాసుని వ్యసనమును పోగొట్టలేడా అని జెప్పి రాజు కాశీకి పోయి శ్రీరామానంద స్వామి పాదముల నీడలో సదా భగవధ్యాన పరుడయ్యెను.

ఆ పులి తన క్రూరస్వభావమును విడచి, స్వజాతి సహవాసమును ఇంద్రియలోలతను విడచి, సాత్వికాహారముతో వసించుతూ, నిరంతరము భగవన్నామ ధ్యానము చేయుచు ఆనాటికి ఎనిమిదవ రోజున శరీరము చాలించెను. మరుజన్మలో పురాతనావటమను గ్రామమున నరసింహమేధ అను భాగవతోత్తముడుగా బ్రాహ్మణ కులమందు జన్మించి శ్రీ పండరినాథుని అంతరంగ భక్తుడయ్యెను. సర్వత్రా యీశ్వర వ్యాప్తిననుభవించెడి వైష్ణవుడైన భాగవతోత్తముని ఆశ్రయించిన పశువైనను, మనుష్యుడైనను, పక్షియైనను, అతని కటాక్షముచే పరమ పదమ నందును.

(పై కథ కోయిల్ ధనాల దేవరాజ స్వామి విరచిత “ఆది పాండరగ భక్త విజయము” నుండి శ్రీమతి ఎమ్. వరలక్ష్మి గారిచే సరళీకరణ)

# రాకుమారుడు - ఏడుచేపల కథ

## వ్రేలు పెడితే కుట్టనా?

అనగనగా ఓ రాజ్యంలో ఒక రాజున్నాడు. ఆ రాజుగారికి ఏడుగురు కుమారులున్నారు. ఒకరోజు ఆ ఏడుగురు రాకుమారులు వేటకు వెళ్ళి ఏడు చేపలు పట్టుకున్నారు. వాటిని ఇంటికి తీసుకువచ్చి ఎండ బెట్టారు. వానిలో ఆరు చేపలు ఎండినాయి, కానీ ఏడవచేప ఎండలేదు. అప్పుడు ఏడవ రాకుమారుడు, "చేపాచేపా! నీ వెందుకు ఎండలేదు?" అని ఆ చేపను అడిగాడు. దానికి ఆ చేప. "నాకు ఒక గడ్డిమోపు అడ్డము వచ్చింది, అది నా మీద ఎండ పడనీయలేదు," అన్నది. ఆ రాకుమారుడప్పుడు గడ్డిమోపుదగ్గరకు వెళ్ళి, "గడ్డిమోపా! గడ్డిమోపా! నువ్వెందుకు ఎండను అడ్డుకున్నావు? నా చేప ఎండలేదు చూడు," అన్నాడు. దానికి ఆ గడ్డిమోపు, "నన్ను గుఱ్ఱం తినలేదు," అన్నది. ఆ రాకుమారుడు గుఱ్ఱం దగ్గరకు వెళ్ళి, "గుఱ్ఱమా గుఱ్ఱమా! నీ వెందుకు గడ్డిమోపును తినలేదు. దానితో నా చేప ఎండలేదు." అన్నాడు.

దానికి ఆ గుఱ్ఱం, "రాకుమారా! నే నీ కొష్టంలోనే కట్టివేయబడ్డాను, జీతగాడు నన్నీరోజు బయటకు తోలుకెళ్ళలేదు," అన్నది. రాకుమారుడప్పుడు జీతగాని దగ్గరకు వెళ్ళి, "ఏమోయ్! నీ వీరోజు గుఱ్ఱాన్ని బయటికి ఎందుకు తోలుకెళ్ళలేదు? గుఱ్ఱం గడ్డి తినలేదు, దానితో గడ్డిమోపు ఎండకు అడ్డం పడింది, నా చేప ఎండలేదు," అన్నాడు. దానికా జీతగాడు, "అయ్యా! ఈ వేళ నాకు అవ్వ బువ్వ పెట్టలేదు. నేను ఆకలితో ఉన్నాను. మరి గుఱ్ఱాన్నెలా బయటికి తోలుకెళ్ళగలను?" అన్నాడు.

రాకుమారుడు ఆ అవ్వ దగ్గరకు వెళ్ళి, "అవ్వా అవ్వా! నీ వీరోజు జీతగానికి ఎందుకు బువ్వ పెట్టలేదు? అతను గుఱ్ఱాన్ని బయటికి తోలుకెళ్ళలేదు. గుఱ్ఱం గడ్డితినలేదు, ఆ గడ్డిమోపు ఎండకు అడ్డుపడింది, దానితో నా చేప ఎండలేదు, " అన్నాడు. దానికి ఆ అవ్వ, "ఓ రాకుమారా! మా అమ్మాయి గుక్కపట్టి ఎడుస్తూనే ఉన్నది. నేను అన్నమెలా వండను? నేను ఆ బిడ్డను సముదాయిస్తున్నాను. దానితో అన్నం వండే తీరికలేదు," అన్నది.

ఆ రాకుమారుడు ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళి, "అమ్మాయి, అమ్మాయి! ఎందుకు ఏడుస్తూనే ఉన్నావు? అవ్వ నిన్ను సముదాయిస్తూ అన్నం వండనే లేదు. జీతగాడు గుఱ్ఱాన్ని బయటికి తోలుకెళ్ళలేదు, గుఱ్ఱం గడ్డి తినలేదు, దానితో గడ్డిమోపు ఎండకు అడ్డం పడింది. నా చేప ఎండలేదు," అన్నాడు. దానికి ఆ అమ్మాయి, "నన్ను చీమ కుట్టింది, అందుకు ఏడుస్తున్నాను." అంది.

రాకుమారుడు, చీమదగ్గరకు వెళ్ళి, "చీమా చీమా! నీ వెందుకు ఆ అమ్మాయిని కుట్టావు? ఆ అమ్మాయి ఎడుస్తూనే ఉంది. ఆ అమ్మాయిని సముదాయిస్తూ అవ్వ అన్నం వండలేదు. అన్నం లేని జీతగాడు గుఱ్ఱాన్ని బయటికి తోలుకెళ్ళలేదు. అందువల్ల గుఱ్ఱం గడ్డితినలేదు. గడ్డిమోపు ఎండకు అడ్డం పడింది. దానితో నా చేప ఎండలేదు," అని అన్నాడు. దానికి ఆ చీమ, "ఆ అమ్మాయి నా బంగారు పుట్టలో వ్రేలు పెట్టితే నేను కుట్టనా?" అన్నది.

ఆ అమ్మాయి, చీమల పుట్టలో వ్రేలుపెట్టకుండా ఉన్నట్లయితే, చీమ ఆ అమ్మాయిని కుట్టి ఉండేది కాదు, ఆ అమ్మాయి ఏడ్చిఉండేది కాదు, అవ్వ బువ్వ వండకుండా ఉండేది కాదు, జీతగాడు ఆకలిగా ఉండేవాడూ కాదు, గుఱ్ఱం కొష్టంలోనే ఉండేది కాదు, గడ్డిమోపు ఎండకు అడ్డం ఉండేది కాదు. చేప ఎండకుండా ఉండేదీ కానే కాదు.

**ఇతరుల విషమాలలో వేలు పెడితే, ఇబ్బందులు తప్పవు.**

**(చిన్మయా మిషన్ వారి సౌజన్యంతో)**

# FORM-IV

(SEE RULE-8)

| | | |
|---|---|---|
| 1. Name of the Magazine | : | Santi (Telugu Language) |
| 2. Place of Publication | : | The Mission of Peace<br>Sri Santi Ashram, Via Sankhavaram,<br>Thotapalli, E. G. Dist.,-533446. A.P. |
| 3. Periodicity of the Publication | : | Monthly |
| 4. Printer's name and address | : | Prop. YAPR Murthy<br>Padmanabha Offset Printers<br># 7-2-10/7, Nageswararao Street,<br>Ramaraopeta, Kakinada-533 004.<br>E.G.Dist., A.P. |
| Whether Citizen of India | : | Yes |
| (If foreigner, State the Country Of Origin) | : | Not Applicable |
| 5. Publisher's Name | : | Swamini Vinamrananda |
| Whether Citizen of India | : | Yes |
| 6. Editor's Name | : | Swamini Vinamrananda |
| 7. Address | : | The Mission of Peace,<br>Sri Santi Ashram, Via Sankhavaram<br>Thotapalli, E. G. Dist., -533466. A.P. |
| 8. Name and address of Individuals who own the Sripaper and more than one percent of the total capital | : | The Board of Trustees and the Committee of Management of Santi Ashram (Regd)<br>Sri Santi Ashram Post, Via Sankhavaram, E.G.Dist., A. P. -533466 |

I, Publisher, Sri Santi Ashram, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

**Swamini Vinamrananda**
Publisher
The Mission of Peace,
Sri Santi Ashram

# దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ, కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435కు ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా లేదా మొబైల్ నంబరు 7382009962కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

# శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)

వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

# విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com కి తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు :State Bank of India, 11 Sansad Marg, New Delhi-110001

A/c Name : THE MISSION OF PEACE - FCRA A/c No : 40127798428
Swift Code : SBININBB104

**1. మాతృ ఆశ్రమం**
శ్రీ శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533 446.
వయా శంఖవరం, తూ.గో.జిల్లా.
సెల్ : 7382009962
రిసెప్షన్ : 6305349677
e-mail:srisanthiashram@gmail.com

**2. విశాఖ : శాంతి ఆశ్రమము**
లాసన్స్‌బే, పెదవాల్తేరు – 530 017
విశాఖపట్నం.
ఫోన్ : 0891 – 2538689
e-mail : srisanthiashramvsp@gmail.com

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి, విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,
కోటగిరి – 643217, నిలగిరి జిల్లా.
తమిళనాడు.
ఫోన్ : 04266–271945
e-mail : vsvmsktg@yahoo.com
vsvmsktg@gmail.com

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము, అశోక్ నగర్
కాకినాడ – 533 004.
తూ.గో.జిల్లా

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టు పేట,
పిఠాపురం–533 450. తూ.గో.జిల్లా.

**Website : www.srisantiashram.org**

# కార్యక్రమములు - మాతృ ఆశ్రమం

**తేది. 1-4-2022** (శుక్రవారం) ఉ॥ 7.30 గం॥లకు అమావాస్య సందర్భంగా అన్నపూర్ణ అష్టోత్తర శతనామార్చన (అన్నపూర్ణ సదన్)

## వసంత నవరాత్రులు

**తేది.2-4-2022** (శనివారం) నుండి తేది. 10-4-2022 (ఆదివారం) వరకు ఉగాది, వసంత నవరాత్రుల సందర్భముగా ప్రతి రోజు ఉ. 7.30 గం॥లకు శ్రీ సీతారామ అష్టోత్తర శతనామార్చన మరియు హనుమాన్ చాలీసా పారాయణము శ్రీ గణేష్ ఆచార్య, శ్రీగంగరాజు మాస్టారు గారిచే నిర్వహించబడును.

ఆచరణ పూర్వక శరణాగతి చెందినపుడే ఈశ్వరానుగ్రహం కలుగుతుంది. ఈశ్వరానుగ్రహం వలననే నువ్వు ఈశ్వరుణ్ణి తలుస్తున్నావు. కోపాన్ని అదుపు చేయలేనివారు ఆధ్యాత్మికానికి అనర్హులు.

**శ్రీరమణ భగవాన్**

తగిన బందోబస్తులు లేనప్పుడే ఇంట్లో దొంగలు పడతారు. ఇంట్లో దీపం వున్నంత సేపు వాళ్ళు లోన జొరబడరు. నీమనసులో నిరంతరం సత్యజ్యోతిని వెలిగించు. ఏ భయపిశాచము, ఏ మోహచోరుడు నిన్ను సమీపించలేడు.

**శ్రీ స్వామి రామతీర్థ**

# శాశ్వత అన్నదానం

1. శ్రీ క్రొవ్విడి వీరభద్ర ప్రసాదరావు గారు (రాజమండ్రి) 5000/-
వీరి శ్రీమతి సీతాహైమావతి గారి జ్ఞాపకార్థం
2. వి. పద్మావతి గారు (బెంగుళూరు) 5011/-
వీరి భర్తగారు వి. రమేష్‌బాబు గారి జ్ఞాపకార్థం
3. శ్రీమతి రెడ్నం చంద్రమతి గారు (హైదరాబాద్) 10,000/-
వీరి భర్తగారు శ్రీ ఆర్. నరసింహరావు గారి జ్ఞాపకార్థం
స్వామీజీ జన్మదినము రోజున అన్నదానం
4. డా॥ కె. శివాజి గారు (హైదరాబాద్) 5000/-
వీరి పెద్దమ్మ గారు శ్రీమతి కె. సుశీల గారి జ్ఞాపకార్థం
5. శ్రీమతి కొల్లేపర సత్యవతి గారు (శాంతి ఆశ్రమం) 5000/-
వీరి తండ్రిగారు శ్రీ నార్కెడమిల్లి రామభద్రరావు గారి ఆత్మశాంతి కొరుతూ...
6. శ్రీ సానిపిని వీర్రాజు గారు (వేట్లపాలెం) 5000/-
వీరి తల్లిగారు శ్రీమతి వీరరాఘవమ్మగారి ఆత్మశాంతి కోరుతూ...
7. శ్రీ వి. రాధాకృష్ణ గారు (కాకినాడ) 5000/-
వీరి సోదరి శ్రీమతి గుండు సుబ్బలక్ష్మి గారి జన్మదినం సందర్భముగా

## విరాళములు

1. శ్రీమతి రెడ్నం చంద్రమతి గారు (హైదరాబాద్) 5000/-
వీరి భర్తగారు కీ॥శే॥ ఆర్. నరసింహరావు గారి జ్ఞాపకార్థం
ఉగాది రోజున అన్నదానం
2. శ్రీ పోలిశెట్టి సాయిబాబాగారు (హైదరాబాద్) 15000/-
విద్యా ఖర్చుల నిమిత్తం
3. శ్రీ పి.వి.వి. రెడ్డి నాయుడు గారు (నాశిక్) 5000/-
4. శ్రీ కంటిపూడి బలరామ్ (టీచర్) గారు (వేట్లపాలెం) 10,000/-
వీరి కుటుంబ సభ్యులు అన్నదానం నిమిత్తం
5. శ్రీ ఎల్.వి. సుబ్బారావు గారు (ఏలూరు) 10,000/-
6. శ్రీమతి చనమోలు సుచరిత గారు (విజయవాడ) 23,500/-
వీరి భర్తగారు శ్రీ సి. హెచ్. వెంకట ఫకీర్ రాయుడు గారి జ్ఞాపకార్థం
గోగ్రాసం నిమిత్తం, మరియు శివరాత్రి పూజ నిమిత్తం

7. శ్రీ కృష్ణరాం భరతుల గారు (న్యూఢిల్లీ) 15000/-
విద్యాఖర్చుల నిమిత్తం

8. శ్రీమతి జి.బి.ఎస్. లక్ష్మి గారు (విశాఖపట్నం) 10,000/-
గోగ్రాసం నిమిత్తం

9. శ్రీమతి గరిమెళ్ళ రేణుక గారు (హైదరాబాద్) 4700/-
అఖండ దీపారాధన నిమిత్తం

10. శ్రీ బొడ్డు వెంకట రమణ గారు (విశాఖపట్నం) 15,000/-
వీరి కుమారుడు, కోడలు, శ్రీ వీరవెంకట సత్యశివ గారు
శ్రీమతి అనురాధ గార్ల జ్ఞాపకార్థం

11. శ్రీ జె. రామకృష్ణ గారు (శాంతి ఆశ్రమం) 5000/-
దిగువ ప్రార్థనా మందిరం గ్రిల్లు నిమిత్తం

12. డా॥ కృష్ణరాం భరతుల గారు (ఢిల్లీ) 1,36,585/-

## మదిలోంచి

అతనొక మహర్షి
ప్రాణం విడిచింది
శ్మశానంలో చితి మండింది
బూడిద మిగిలింది
అక్కడితో అతని జీవితం ముగిసింది
అతని భావాలు మిగిలాయి
అతని అడుగులు మిగిలాయి
వాటిని మదిలో మిగుల్చుకో
జ్ఞాపకాలుగా మిగుల్చుకో...
అప్పుడవి మధుర స్మృతులు అవుతాయి
జీవితంలో కొందరి భావాలు
అభిప్రాయాలు, మాటలు
నిన్ను బాధిస్తే...
ఆ సందర్భాలను...
శ్మశానవాటికలో కాల్చినట్లు
మదిలోంచి అవి తీసివేసి...
కాల్చి సుఖపడు !
-ఎందుకంటే-
కొందరు వారు సుఖపడరు...
మనల్ని సుఖపడనివ్వరు
అందుకే వారిని మదిలోంచి తీసివేయి
జీవితానికి అర్థంచూపు !

– మలిశెట్టి శ్రీనువాస రంగారావు (బన్ను)

This Periodical is Registered with Registrar of Newspapers, New Delhi Vide R.No. 3447/57, Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2021-2023

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

1. Auto Biography of Swami Omkar (2 Volumes) .......... Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar .......... Rs. 10/-
3. Soham .......... Rs. 10/-
4. Cosmic Fast .......... Rs. 20/-
5. Meditation .......... Rs.10/-
6. Om Japa .......... Rs.10/-
7. Control of Mind .......... Rs.30/-
8. Cosmic Flashes .......... Rs.10/-
9. In the Hours of Silence .......... Rs.10/-
10. The Soul of Omkar .......... Rs.10/-
11. How I learned English .......... Rs.10/-
12. Reincarnation of my Little Sister .......... Rs.10/-
13. God Realization Now and Here .......... Rs.10/-
14. Mystic Prayers and Poems .......... Rs.20/-
15. The Divine Voice of Omkar .......... Rs.40/-
16. Auto Biography of Omkar (Revised Edition) .......... Rs.100/-
17. Petals of Peace .......... Rs.20/-
18. The Story of my life and Work .......... Rs.10/-
19. Priceless legacy of Swami Omkar .......... Rs.10/-
20. The Four Initiations .......... Rs.10/-
21. Musings .......... Rs.20/-
22. Peace Prayer .......... Rs.20/-

THE MISSION OF PEACE
శ్రీ శాంతి ఆశ్రమము
పోస్టు : శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446.
తూ॥గో॥జిల్లా., (ఆ.ప్ర.)
ఫోన్ : 7382009962
email:srisanthiashram@gmail.com
www :www.srisantiashram.org

Printed Book

To

Printed by Padmanabha Offset Printers and Published by Swamini Vinamrananda on behalf of The Mission of Peace Sri Santi Ashram and Printed at Padmanabha Off-set Printers, Kakinada - 533 004 Cell : 93979 50719 and Published at Thotapalli Hills 533 446 Ph : 7382009962 Editor : Swamini Vinamrananda.